క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: నల్గొండ జిల్లా తుంగతుర్తిలో ఆదివారం జరిగిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి దశదిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులను, సీనియర్ నాయకులతో కలిసి దామోదర్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: హైకోర్ట్ జీవో నంబర్ 9పై స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల పిలుపు మేరకు ఈనెల 18న చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు దండు ఆదినారాయణ, దుస్సా వెంకటేశ్వర్లు, అప్పారావు, షరీఫ్, దాసు, పిల్లి మల్లికార్జున్, దార్ల రవివర్మ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి బాధాకరం



సత్తుపల్లిలో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

సత్తుపల్లిటౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడి చేయటాన్ని సత్తుపల్లి మలమహానాడు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మల్లికార్జున్, బి.వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఆదివారం సత్తుపల్లి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో రమేష్, కృష్ణ, ఆనంద్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.


స్నేహితుడికి రూ. 1.50లక్షల ఆర్థిక సాయం



మిత్రుడికి నగదు అందిస్తున్న స్నేహితులు

తల్లాడ: ఆపదలో ఉన్న తన స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆదివారం రూ. 1.50 లక్షల ఆర్థిక సాయం అందించి మంచిమనసు చాటుకున్నారు. ఖమ్మం పాకబండ బజారుకు చెందిన సందా సతీష్ గణేష్ నవరాత్రోత్సవాల ముగింపు రోజు వినాయక విగ్రహం ప్రమాదవశాత్తు అతనిపై పడటంతో వెన్నుముక విరిగింది. రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలుపగా.. విషయం తెలుసుకున్న అన్నారుగూడెం గ్రామానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు, తనతో పాటు ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న షేక్ నజీర్ పాషా, రేగళ్ల వీరబాబు, గ్రానైట్ అసోషియేషన్ సభ్యులు, మార్కర్లు కలిసి రూ.1.50లక్షలు నగదు సేకరించి సతీష్ కుటుంబానికి అందజేశారు.

మంగాపురం రామాలయానికి రూ.3 లక్షల విరాళం



పరాంకుశం రామకృష్ణ, జాన్సీ కృష్ణ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తల్లాడ: మండలంలోని మంగాపురం రామాలయం అభివృద్ధికి ప్రభుత్వ ఉపాధ్యాయులైన పరాంకుశం రామకృష్ణ, జాన్సీ కృష్ణ దంపతులు రూ.3 లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా వారిని ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. పరాంకుశం రామకృష్ణ ఆలయ పూజారిగా పని చేశారు.

ఏరియా ఆస్పత్రిలో సౌకర్యాలేవయా..!



అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

- ఆరుగురు డాక్టర్లు ఉన్నా.. వైద్యం కరువు
- బడ్జెట్ లేదు.. పర్యవేక్షణ అంతంతే
- బాధ్యత రహితంగా సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

వైరా: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. పేరుకే 24 గంటల ఆస్పత్రి కానీ ఏ సమయానికి వెళ్లిన ఇక్కడ వైద్యులు మాత్రం అందుబాటులో ఉండరు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏడాది క్రితం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయగా ఇదే ఆస్పత్రిలో ఉన్న పీహెచ్‌సీని సోమవరం గ్రామంలో ఏర్పాటు చేశారు. ఆసత్రిలో సమయపాలన పాటించకపోవడంతో ఇక్కడి వైద్యాధికారుల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది.

సౌకర్యాలు లేవు..

ఇక్కడి వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సౌకార్యలేమి కొట్టచ్చినట్లు కనబడుతుంది. గత 70ఏళ్ల క్రితం అప్పటి అవసరాల నిమిత్తం నిర్మించిన ఆస్పత్రి ప్రాంగణంలోనే ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయడంతో వైద్య సేవలు ఏ మాత్రం అందడం లేదు. ఆస్పత్రికి రోజు చికిత్స నిమిత్తం 200మంది పైగా రోగులు వచ్చి వెళ్తుంటారు. ఆస్పత్రిలో 5బెడ్లు మాత్రమే ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో గతంలో మాదిరి గానే జిల్లా కేంద్రానికి లేదంటే ప్రైవేట్ ఆస్పత్రిలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడి ఆస్పత్రిలో రక్షపరీక్షలకు సంబంధించి గర్భ నిర్ధారణ, హెచ్‌బీఎ-1, ఆర్బీఎస్, హెచ్ఐవీ, మలేరియా పరీక్షలు మినహా టైఫాయిడ్, డెంగీ వంటి రక్త పరీక్షలకు మరల ప్రైవేట్ ఆస్పత్రి ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తుంది.

బడ్జెట్ లేదు.. పర్యవేక్షణ అంతంతే..

ఆస్పత్రిలో ఏడాది క్రితం వైద్య పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో ప్రధానంగా డార్మాటలజీ, గైనాకాలజిస్ట్-2, పెతాలజీ, అనస్తీసియా, పెడ్రియాట్రిక్ట్ వైద్యులు మాత్రమే ఉన్నారు. 18మంది సిబ్బంది జిల్లాలోని వివిధ ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఏడాది నుండి కనీసం బడ్జెట్ ప్లానింగ్ అంటూ ఏమి లేకుండానే ఆస్పత్రి నిర్వాహణ సాగుతుంది. కనీసం శానిటేషన్ బడ్జెట్ కూడా లేకపోవడంతో ఎటువంటి పారిశుద్ధ్య పనులు జరగడం లేదు.



ఆస్పత్రి ఆవరణలో సంచరిస్తున్న పశువులు

వైరా కేంద్రంగానే జిల్లా ఆస్పత్రికి అవకాశం..

ప్రస్తుతం వైరాలో 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణ పనులు రూ. 37.50 కోట్లతో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లా వైద్య విధాన ప్రభుత్వ ఆస్పత్రి లేకపోవడంతో.. అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు వైరా ఆస్పత్రి కేంద్రంగా మారే అవకాశముంది. అలాంటిది ఈ ఆస్పత్రి సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతుంది.

నిర్లక్ష్యంగా సిబ్బంది..

ఇక్కడ ఏరియా ఆస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం.. రోగుల పాలిట శాపంగా మారింది. ఆస్పత్రికి వైరా మున్సిపాలిటీతో పాటు సమీపంలోని కొణిజర్ల, తల్లాడ మండలాల నుంచి రోగులు వస్తుంటారు.



ఏరియా ఆస్పత్రిలో బెడ్ల పరిస్థితి

కానీ సిబ్బంది, వైద్యులు వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోగులు నిరుత్సాహంతో వెనుదిరగాల్సి వస్తుంది. ఇటీవల రాత్రివేళలో రోడ్డుప్రమాద క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకురాగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రైవేట్‌లో వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది. ఆవరణలో కుక్కలు, ఆవులు సంచరిస్తున్న పట్టించుకున్న నాధుడే లేడు. ఇకనైనా జిల్లా విద్యవిధాన పరిషత్ అధికారులు ఆస్పత్రిని సందర్శించి ప్రక్షాళన చేస్తే రోగులకు వైద్యసేవలు మరింత దగ్గరవుతాయి. లేదంటే ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది.

సిబ్బంది పనితీరు మెరుగు పరుస్తాం..

వైరాకు మంజూరైన ఏరియా ఆసత్రి సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లాలోని మంత్రుల దృష్టికి తీసుకెళ్లాను. సిబ్బంది అలసత్వంపై విచారణ చేపడతాము. 100 పడకల ఆస్పత్రి పూర్తి అయితే వైద్య సేవలు మరింత మెరుగవుతాయి.

– రాజశేఖర్ గౌడ్, డీసీహెచ్ డాక్టర్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. భజ్యాతండా జీపీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు, విశ్వనాథపల్లి మాజీ సర్పంచ్ అజ్మీరా క్రాంతి, మాజీ ఉపసర్పంచ్ భూక్యా మోహన్‌రావు, వ్యాపారవేత్త అజ్మీరా నరేష్ - నికిత, వాంకుడోత్ బాబులాల్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్యే కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీని నమ్ముకొన్న వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరాలాల్, నాయకులు షేక్ సైదులు, గుత్తా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ జ్ఞాపకాలు మరపురానివి



మాట్లాడుతున్న మల్లు నందిని

మధిర: ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నదని, ఆ జ్ఞాపకాలు మరవురానివని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని పేర్కొన్నారు. మధిర రెడ్డి గార్డెన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1989 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించగా, ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతురావు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీకి తొత్తుగా మారిన ఎన్నికల కమిషన్’



సంతకాలు సేకరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మట్టా దయానంద్

సత్తుపల్లి: ఎన్నికల కమిషన్ బీజేపీ తొత్తుగా మారిందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఆదివారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఓటు చోర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఓటు చోర్ కార్యక్రమం విజయవంతం చేయాలని, ఈ ఉద్యమం ద్వారా బీజేపీ మోసాన్ని ఎండకట్టి ఆ పార్టీని దేశ ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, శివవేణు, దొడ్డా శ్రీనివాసరావు, నరుకుళ్ల కృష్ణారావు, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, పింగళి సామేలు, కొప్పుల నరేందర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

‘ఓటు చోరీ’ని ఖండించండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు

సత్తుపల్లిరూరల్: ఓటు చోరీ కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల వీరంరాజు అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లిలో కొంత మంది ఓట్ చోరీ అనే కార్యక్రమంపై సంతకాల సేకరణ చేయడం జరిగిందని.. మరి అసలు ఓటు చోరు ఎప్పుడు జరిగింది.. గతంలో గాంధీ వారసత్వాన్ని చోరీ చేసింది ఎవరు..? అప్పటి నుండి ఇప్పటి వరకు కుటుంబ పాలన, కుటుంబ ఆధీనంలోనే మీ కాంగ్రెస్ పార్టీ నడుస్తుందన్నారు. ఓట్ చోరీకి మారు పేరుగా నిలిచిన వారే ఓట్‌చోరీ అంటూ అసత్యప్రచారాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మొన్న తెలంగాణలో అధికారం చేపట్టిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఓటుకు నోటు కేసులో ఉన్నారు.. మరి దాన్ని ఏమంటారు..? అది ఓటు చోరు కాదా అని ప్రశ్నించారు. గత 50 ఏళ్లుగా దేశంలో అధికారాన్ని చేపట్టింది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం కాదా.. అంటే ఈ 50 ఏళ్లు కూడా ఓటు చోరీ చేసే అధికారాన్ని చేపట్టారా అని ప్రశ్నించారు. పట్టణ అధ్యక్షుడు బానోత్ విజయ్ మాట్లాడుతూ.. సత్తుపల్లిలో స్వేచ్ఛగా ఇసుక దందా, మట్టి దందా, సెటిల్మెంట్ చేసుకుంటూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్న కొంతమంది నరేంద్ర మోదీని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. వీలైతే అభివృద్ధి చేయాలి కానీ సంతకాల సేకరణ అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ, కార్యదర్శి జోనబోయిన కార్తీక్, మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, పర్సా రాంబాబు, తెనాలి అశోక్, సాయి, మన్నేని నర్సింహమూర్తి, వంశీ, మెరుగు శేషగిరిరావు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న జైపాల్



డీసీసీ ఎన్నికల పరిశీలకుడు మహేందర్‌కు దరఖాస్తు అందిస్తున్న సూతకాని జైపాల్

వైరా: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వైరా మాజీ మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు సూతకాని జైపాల్ ఆదివారం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం డీసీసీ ఎన్నికల పరిశీలకుడిగా వచ్చిన కె.మహేందర్‌ను కలిసి దరఖాస్తు అందించారు. జైపాల్ గతంలో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగానూ, పొంగులేటితోటే బీఆర్ఎస్‌లో చేరి వైరా మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశాడు. ప్రస్తుతం తన సొంత పార్టీ కాంగ్రెస్‌లో చేరాడు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం..

వైరా: వైరా ఏఎంసీ చైర్మన్‌గా నూతనంగా నియమితుడైన బోళ్ల గంగారావును తనతో చదివిన బాల్య స్నేహితులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, గ్రంధీ లక్ష్మీనరసయ్య, మిట్టపల్లి సైదేశ్వరరావు, ధనాలకోట దుర్గాప్రసాద్, మిట్టపల్లి రాము, ఊటుకూరి రామారావు, గండు యాదగిరి, కస్తాల శ్రీనివాసరావు, కొల్లి హనుమంతరావు, సిరిపురపు రవి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన పోలీసులకు..



ఏఎస్సై కృష్ణమూర్తిని సత్కరిస్తున్న ఎస్సై రామారావు, పోలీసులు

వైరా పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎస్సై పుష్పాల రామారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. గత కొన్నేళ్లుగా వైరా పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసిన కృష్ణమూర్తి ఏఎస్సైగా పదోన్నతి పొంది మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. వైరా పోలీస్ స్టేషన్‌లోనే రైటర్‌గా పని చేసిన మాతంగి విజయ్ బదిలీపై తల్లాడ వెళ్తున్న క్రమంలో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు,.

ఎంబీబీఎస్ సీటు సాధించిన సంధ్యారాణికి..



ఎంబీబీఎస్ విద్యార్థిని సంధ్యారాణిని సన్మానిస్తున్న కిన్నెర కుటుంబ సభ్యులు

తల్లాడ: ఇటీవల విడుదలైన నీట్ పరీక్షా ఫలితాల్లో ఖమ్మం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన గొడ్ల సంధ్యారాణిని ఆదివారం సన్మానించారు. కిన్నెర కుటుంబాల ఆడపడుచు సంధ్యారాణిని కిన్నెర బలగం తరపున అన్నారుగూడెంలో సన్మానించి.. సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కిన్నెర రాములు, కిన్నెర వెంకటేశ్వరరావు, ప్రసాద్, శ్రీను, నాగేశ్వరరావు, ఆనందరావు, నాగేంద్రరావు, బలగం పాల్గొన్నారు.

సింగరేణి బాధితులను ఆదుకోండి

సత్తుపల్లి: సత్తుపల్లిలో సింగరేణి ఓపెన్‌కాస్టు బ్లాస్టింగ్‌ల వల్ల నష్టపోతున్న బాధితులను ఆదుకోవాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని ఆదివారం బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఈ ప్రాంతంలోని సత్తుపల్లి, రేజర్ల, కిష్టారం ప్రాంత వాసులు సైలోబంకర్, సింగరేణి బాంబుబ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లు దెబ్బతింటున్నాయని, అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, భూమికోల్పోయిన బాధితులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఆపాలని కిషన్‌రెడ్డికి వినతి..



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి వినతిపత్రం అందచేశారు. ఎక్స్‌ప్రెస్ రైలు ఆపడం వల్ల ఈప్రాంత ప్రజలకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు నూతక్కి నర్సింహారావు, పింగళి శ్రీనివాసరావు, మొగిలి అప్పారావు, దండెం సత్యనారయణరెడ్డి, కొప్పు రవి తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



కుర్చీలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్‌మోహన్

సత్తుపల్లిటౌన్: సమాజానికి లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్‌డిస్ట్రిక్ గవర్నర్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. సత్తుపల్లిలో ఆదివారం స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల సౌకర్యార్థం స్వామివివేకానంద ఎక్స్‌లెన్స్ కేంద్రానికి రూ.25వేలు విలువచేసే వంద కుర్చీలను అందించి, స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు ప్రతిరోజు అల్పాహారం అందించటంతో పాటు నేత్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్తుపల్లి లయన్స్‌క్లబ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గొంగడి రవి, కోఆర్డినేటర్ బాచుపల్లి రవీందర్, కె.సతీష్, రమణ, దారా కృష్ణారావు, గంధ్ర సోమిరెడ్డి, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, పెనుగొండ రమేష్, శ్రీనివాసరెడ్డి, గట్టే వాసు, యోగా అప్పారావు, చల్లగుళ్ల శ్రీనివాసరావు, మాధురి మధు, మందపాటి చెన్నారెడ్డి, సత్యనారాయణ, సలీం, రమణ, రమేష్, నగేష్ పాల్గొన్నారు.

పాత దుస్తులు పంపిణీ



నిరుపేదలకు పాత దుస్తులను పంపిణీ చేస్తున్న లంకా కొండయ్య

మధిర: మధిరలోని మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం నిర్వాహకులు లంకా కొండయ్య నిరుపేదలకు ఆదివారం పాత దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాడకుండా వదిలేసిన పాత దుస్తులను మరొకరికి ఉపయోగపడేలా చేసేందుకు మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంతో మంది దాతలు తమ కేంద్రానికి పాత దుస్తులను అందజేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చింతకాని: మండలంలోని జగన్నాధపురం గ్రామం వద్ద ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ముదిగొండ మండలం గంధసిరి మున్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

బోనకల్: హరితవిప్లవ పితామహుడు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని జిల్లా రైతుసంఘం కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వ్యవసాయరంగం సమస్యలపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. వ్యవసాయరంగ అభివృద్ధి కుంటుపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు వ్యవసాయరంగానికి పెద్దపీట వేసి ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సునీత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం


బదిలీ సీఈవో వీరారెడ్డికి..




బనిగండ్లపాడులో సీఈవో వీరారెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్ అక్కిరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఇటీవల బదిలీపై వెళ్లిన సీఈవో ఎన్.వీరారెడ్డిని సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఈవోలు ఆర్.ఏసుబాబు, బొగ్గుల శివారెడ్డి, సుఖభోగి మోహన్‌రావు తదితరులున్నారు.

లారీ అండ్ డీసీఎం ఓనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు రాంబాబు



వర్కింగ్ ప్రెసిడెంట్ మాడిశెట్టి సురేష్

కల్లూరు: కల్లూరు మండల లారీ అండ్ డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ వెల్ఫేర్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ఆదివారం కల్లూరు కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా బానోత్ రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాడిశెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి నరేష్, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి అచ్యుత్, సహాయ కార్యదర్శిగా బోడా మహేష్, కోశాధికారిగా కేవీ సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా ఎస్కే పాషా, గౌరవ అధ్యక్షులుగా మాడిశెట్టి నాగరాజు, పాశం నరసింహారావు, గుండ్ల కోటేశ్వరరావులు ఎంపికయ్యారు.

నియామకం..



మహాదేవ లక్ష్మి, రహీమున్నీసా

సత్తుపల్లిరూరల్: తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం వర్కర్ల యూనియన్ ఖమ్మం జిల్లా రెండో మహాసభలో తల్లాడ మండల కేంద్రంలో జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. సత్తుపల్లి మండలానికి చెందిన మహాదేవ లక్ష్మి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికోగా, జిల్లా సహాయ కార్యదర్శిగా షేక్‌రహీమున్నీసాను ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వెంకటలక్ష్మి, జయమ్మ, శ్రీలక్ష్మణులను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను రాష్ట్ర ఏఐటీయూసీ నాయకులు, జిల్లా ఏఐటీయూసీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మండల ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి బసవయ్య, తెలగారపు రామారావు పాల్గొన్నారు.

తుమ్మలకు వినతి..

కల్లూరురూరల్: కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రమైనందున ఇక్కడ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలని మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దబోయిన రామ నర్సింహారావు ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కల్లూరు మండల జనాభా సుమారు 75వేలకుపైగా చేరుకుందని, సత్తుపల్లి తర్వాత కల్లూరు మండలంలోని సివిల్, క్రిమినల్ కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. సత్తుపల్లిలో గల ఫస్ట్‌క్లాస్ జ్యూడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టుకు వెళ్లాలంటే కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి, దారుగా బంజరు, తాళ్లూరు వెంకటాపురం, వెన్నవల్లి గ్రామాల ప్రజలకు సుమారు 80 కిలో మీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తుందన్నారు.